క్లుప్తంగా

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

● సీడీపీఓ ప్రసన్న

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కార్యకర్తలు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేది లేదని సీడీపీఓ జి. ప్రసన్న స్పష్టం చేశారు. బొత్సపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని, చిన్నారులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు.

రోగులకు మెరుగైన భోజనం

విజయనగరం ఫోర్ట్: రోగులకు మెరుగైన భోజనం పెట్టాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పు అప్పలరాజు అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు అందించే భోజనాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స పొందే రోగులకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం భోజనం పెట్టాలన్నారు. నాణ్యతలో రాజీ పడొద్దని సూచించారు. కార్యక్రమంలో టీమ్ లీడర్ భాను, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

డెంకాడ: నాతవలస టోల్‌గేట్ కార్మికులు శనివారం రక్తదానం చేశారు. నేషనల్‌హైవే టోల్ గేట్, నాతవలస టోల్‌గేట్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో పలువురు కార్మికులు రక్తదానం చేసి, ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో నేషనల్ హైవే టోల్‌గేట్ పీడీ శివశంకర్, సంఘ అధ్యక్షుడు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సుకన్య సమృద్ధి యోజన పథకంపై అవగాహన

భోగాపురం: బాలికలకు ఎంతో ప్రయోజనం చేకూర్చే సుకన్య సమృద్ధి యోజన పథకంపై మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో ఏఎస్పీ శ్రీనివాసరావు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్పీఎం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహప్రవేశాలకు సిద్ధంకండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ఉగాది నాటికి జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం కావాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా పురోగతి, సమస్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు, మండల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

విజయనగరం అర్బన్: పట్టణంలోని కస్పా మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ (ఎస్బీసీసీ) జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ మాట్లాడుతూ, సుస్థిర అభివృద్ధికి బాల్య వివాహాలు అవరోధంగా మారుతున్నాయన్నారు. అనంతరం జంక్‌ఫుడ్, రక్తహీనత, లింగ వివక్షపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఆర్. శంకరరావు, మహిళా సంరక్షణ కార్యదర్శి గాయత్రి, ఏఎన్‌ఎం సుహాసిని, ఆశా కార్యకర్త కనక మహాలక్ష్మి, పీఈడీ ఈశ్వర్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల సత్తా..



విద్యార్థులను అభినందిస్తున్న అకాడమీ డైరెక్టర్ రమేష్

విజయనగరం అర్బన్: చార్టెడ్ అకౌంటెంట్ (సీఏ), సీఎంఏ ఫౌండేషన్ పరీక్షల ఫలితాలలో పట్టణానికి చెందిన ఆర్ఎస్ అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ మేరకు అకాడమీ డైరెక్టర్ ఎ.రమేష్ శనివారం మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో గతేడాది డిసెంబర్ నెలలో జరిగిన సీఎంఏ ఫౌండేషన్ పరీక్షలో శత శాతం, సీఏ ఫౌండేషన్ పరీక్షలో 62 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. సీఏ ఫౌండేషన్ పరీక్షలో ఎస్.స్నేహలతకు 269/400, ఎస్.నితిన్‌కు 247/400 మార్కులు వచ్చాయని, అదేవిధంగా సీఎంఏ ఫౌండేషన్ పరీక్షలో వీవీ శ్రీధర్ 326/400, ఎన్.గాయత్రి 312/400, బీఎస్‌కే శ్రీనివాసిని 306/400 మార్కులు సాధించారని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను ఫాకల్టీ సభ్యులు అభినందించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

● అంకాలజిస్ట్ నవ్య



క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న అంకాలజిస్ట్ నవ్య



విజయనగరం ఫోర్ట్: ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

విజయనగరం: విద్యార్థి దశ నుంచే క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని అంకాలజిస్ట్ నవ్య అన్నారు. శనివారం స్థానిక శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం, విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్యాన్సర్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధిపై ఎన్నో అపోహలున్నాయని.. వాటన్నింటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. శరీరంలో ఉండే కణజాలం తన రూపాన్ని మార్చుకొని విస్తృతంగా పెరగడాన్ని క్యాన్సర్ అంటారని తెలిపారు. శరీరంలో ఏ భాగానికైనా క్యాన్సర్ రావచ్చన్నారు. ముందస్తు వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల 14 నుంచి 25 సంవత్సరాల లోపు బాల బాలికలకు క్యాన్సర్ రాకుండా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం ద్వారా క్యాన్సర్ సంక్రమిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాయామం చేయడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటగుప్త, విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ ఇల్తమాష్, గ్రామీణ వైద్యుల సంఘ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, విజయదుర్గ సొసైటీ చంద్రిక, కార్యదర్శి కోట్ల పైడిరాజు, కోశాధికారి ఉమాశంకర్, సహాయ కార్యదర్శి మక్కువ రమణ, అంజన్‌రాయ్, దివాకర్ గుప్త, ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం

విజయనగరం ఫోర్ట్: క్యాన్సర్‌పై అవగాహన అవసరమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా మహాత్మాగాంధీ హాస్పిటల్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, రోటరీ క్లబ్, ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కోట వద్ద ప్రారంభమైన ర్యాలీ గురజాడ అప్పారావు రోడ్, సత్య లాడ్జీ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం మీదుగా బాలాజీ జంక్షన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా మహిళలు క్యాన్సర్ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. మహిళలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. క్యాన్సర్‌ను ముందుస్తుగా గుర్తించి చికిత్స చేయడం వల్ల తీవ్రత తగ్గించవచ్చని చెప్పారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ఒక మహిళ తన జీవితంలో ఏదో ఒక రమైన క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు, డాక్టర్ రజని, డాక్టర్ మృత్యుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా షిర్డీసాయి ఆలయ ప్రారంభోత్సవం



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: నగరంలోని 20వ డివిజన్ శాంతినగర్ ప్రాంతంలో సీతారామ సహిత సంపత్ వినాయక షిర్డీ సాయిరామ్ ఆలయ ప్రారంభోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొని ప్రతిష్ఠించిన దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవాధ్యక్షుడు, స్థానిక కార్పొరేటర్ కంటుభుక్త తవిటీరాజు మాట్లాడుతూ, శాంతినగర్ పైనాలవీధి జంక్షన్‌లో గతంలో దుర్గంధభరిత వాతావరణం ఏర్పడి అపరిశుభ్రంగా ఉండేదన్నారు. ఆ ప్రాంతాన్ని కమిటీ సభ్యుల సమష్టి కృషితో శుభ్రం చేసి ఆలయ నిర్మాణానికి కృషి చేశామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్లు అందజేత



రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, తదితరులు

డెంకాడ: మండల విద్యావనరుల కేంద్రంలో టీబీ రోగులకు ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు శనివారం పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. హిన్స్, స్యామ్‌సని ఫౌండేషన్ పౌష్టికాహారం సమకూర్చింది. కార్యక్రమంలో ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు, ఫౌండేషన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ అధిష్టానంపై పతివాడ సీరియస్

● నియోజకవర్గ ఇన్‌చార్జి మార్పుపై ఆగ్రహం
● తనను అగౌరవపరిచారంటూ ఆవేదన
● అధిష్టానం వద్ద తేల్చుకుంటానంటూ బంగార్రాజుపై మండిపాటు



మాట్లాడుతున్న పతివాడ నారాయణస్వామి

పూసపాటిరేగ: టీడీపీ కోసం నలభై ఏళ్లుగా పనిచేస్తున్న సీనియర్ నాయకుడికి అధిష్టానం ఇచ్చే గౌరవం ఇదేనా?.. తనకు మాట కూడా చెప్పకుండా టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను తప్పించడంపై మాజీ మంత్రి పతివాడ నారాయణస్వామి నాయుడు మండిపడ్డారు. చల్లవానితోటలోని తన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను సంప్రదించకుండా నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను బంగార్రాజుకు ఇవ్వడంపై ఆగ్రహంతో ఊగిపోయారు. 40 ఏళ్లుగా టీడీపీ జెండా మోసిన తనను అగౌరవపరిచారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఒక్కసారి ఎంపీపీగా చేసిన వ్యక్తికి బాధ్యతలు అప్పగించడంతో కార్యకర్తలు మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కార్యకర్తల అభిప్రాయాలు మేరకు తదుపరి కార్యచరణ ప్రకటిస్తామని స్పష్టంచేశారు. మాజీ ఎంపీపీ మహంతి చిన్నంనాయుడు మాట్లాడుతూ ఐదుసార్లు ఎంపీపీగా చేసిన తనను సంప్రదించకుండా ఏకపక్షంగా నియోజకవర్గ ఇన్‌చార్జిను నియమించడం ఆవేదన కలిగించిందన్నారు. ఏడుసార్లు నీతి నిజాయితీతో ఎమ్మెల్యేగా పనిచేసి, ప్రజాభిమానం ఉన్న పతివాడను టీడీపీ అధిష్టానం అగౌరవపరిచిందన్నారు.

పతివాడను కలిసిన బంగార్రాజు

ఇదిలా ఉండగా టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియామకమైన భోగాపురం మండలానికి చెందిన కర్రోతు బంగార్రాజు చల్లవానిపేట వచ్చి పతివాడను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆ సమయంలో పతివాడ ఆగ్రహావేశాలతో ఊగిపోయారు. ఇన్‌చార్జి అయిన తనకు చెప్పకుండా మార్చడం ఏమిటని అధిష్టానంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ పెద్దల వద్ద తేల్చుకుంటానని స్పష్టం చేశారు. ఇది జరిగిన కాసేపటికే పార్టీ అధిష్టానమే శిరోధార్యమంటూ ప్రకటించారు. సమావేశంలో జెడ్పీ మాజీ సభ్యులు ఆకిరి ప్రసాదరావు, పతివాడ అప్పలనారాయణ, పతివాడ అప్పలనాయుడు, పతివాడ తమ్మునాయుడు, చిల్ల పద్మ, పీతల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ డిమాండ్ చేశారు. విజయనగరం మెడికల్ కళాశాల వద్ద సీఐటీయూ జెండాను నాయకుడు రెడ్డి శంకరరావు శనివారం ఎగురవేశారు. ఈ సందర్భంగా 30 మంది ఆటో కార్మికులు సీఐటీయూలో చేరారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి బి. రమణ, కంది త్రినాథ్, స్టాండ్ ప్రెసిడెంట్ సురేష్, స్థానిక నాయకులు నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ కార్డుకు ఆధార్‌తో అనుసంధానించాలి

నెల్లిమర్ల: ఓటర్‌కార్డుకు ఆధార్‌తో అనుసంధానించే ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ కేవీ రమణరాజు బీఎల్‌ఓలకు ఆదేశించారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్లంతా తమ ఆధార్‌ను ఓటుకు అనుసంధానం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

నెల్లిమర్ల: కిశోర బాలికల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి ఎస్‌వీ రమణమూర్తి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సఖి సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికల విద్యకు, ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు గ్రూపుల్లో చర్చించుకోవాలని సూచించారు. సీడీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ జి. గిరిబాల, నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీప్రసాద్, ఎస్సై పి. నారాయణరావు, వైద్యాధికారి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వేదిక నిర్మాణానికి శంకుస్థాపన



వేదిక నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న హెచ్‌ఎం ఇందిరాదేవి

భోగాపురం: మండలంలోని పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో వేదిక నిర్మాణానికి హెచ్‌ఎం ఇందిరాదేవి శనివారం శంకుస్థాపన చేశారు. పోలిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నింటి చిన్న తన తండ్రి రత్నం జ్ఞాపకార్థం వేదిక నిర్మిస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పిన్నింటి రమణ, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న గోరుముద్ద'



రెడ్డికంచేరు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచిచూస్తున్న మండల ప్రత్యేకాధికారి పద్మావతి

భోగాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని పక్కాగా అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.పద్మావతి అన్నారు. మండలంలోని రెడ్డికంచేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ తప్పకుండా పాటిస్తూ రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. అనంతరం 8, 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థినులకు స్త్రీ అక్షరాస్యత, గుడ్/బ్యాడ్ టచ్, పోక్సో, దిశా చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యా సంబంధిత విషయాలపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యారంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అమలయ్యేలా చూడాలని సూచించారు. పాఠశాల భవనాల మధ్య నుంచి 11 కేవీ విద్యుత్‌లైన్ ఉందన్న విషయాన్ని హెచ్‌ఎం కల్పన మండల ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకురాగా.. వెంటనే విద్యుత్ లైన్‌ను మార్చాలని ట్రాన్స్‌కో ఏఈ జ్ఞానేశ్వరరావును ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు రమణమూర్తి, రమణ, సర్పంచ్ బైరెడ్డి రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

భోగాపురం: ఎటువంటి అనుమతుల్లేకుండా సముద్రపు ఇసుక తరలిస్తున్న లారీని ఎస్సై కృష్ణమూర్తి స్థానిక జాతీయ రహదారిపై శనివారం సీజ్ చేశారు. ఆనందపురం నుంచి ఒడిశాకు ఇసుక తరలిస్తున్నట్లు చెప్పారు. డ్రైవర్ గౌరినాయుడును అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఒత్తిడికి దూరం

నెల్లిమర్ల: పరీక్షలు సమీపిస్తున్న దృష్ట్యా విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సూచించారు. పట్టణంలోని వేణుగోపాలపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటి నుంచే విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని, పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఫిర్యాదుల పెట్టెను పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ ర్యాలీ

విజయనగరం: వాసవీక్లబ్ విజయనగరం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పర్యావరణ ర్యాలీకి స్పందన లభించింది. క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ ఆత్మకూరి సతీష్ పిలుపుమేరకు ప్లాస్టిక్ వస్తువులను నిషేధించండి.... పర్యావరణాన్ని పరిరక్షించండి... గుడ్డ సంచుల వినియోగం అలవర్చుకోవాలి - ఆరోగ్యాన్ని రక్షించుకోవాలంటూ నినాదాలు చేశారు. నగరంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి డాబాగార్డెన్, రైతుబజార్, చిన్నవీధి ప్రాంతాల మీదుగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా క్లబ్ రీజనల్ సెక్రటరీ ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రాణాలకు ముప్పు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కందుల సంతోష్, సముద్రాల నాగరాజు, ఏవీఎస్ కుమార్, మాచర్ల చంద్రశేఖర్‌గుప్త, ఏడుకొండలు, రాంజీ, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



నగరంలోని అభివృద్ధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: రాష్ట్రంలోనే విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శనగరంగా తీర్చిదిద్దటమే ధ్యేయంగా పని చేస్తున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలో 60 లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం శంకుస్థాపనలు చేశారు. 13వ డివిజన్‌లోని కొత్తపేట రాధాకృష్ణ కల్యాణ మంటపం సమీపంలో 21 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న రహదారికి.. 17వ డివిజన్లో 18 లక్షల రూపాయలతో చేపట్టిన రహదారి నిర్మాణానికి.. 35వ డివిజన్లో 22 లక్షల రూపాయలతో నిర్మించనున్న రహదారి, కల్వర్టుల నిర్మాణాలకు కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో నగరంలో వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. గతంలో చేపట్టిన వార్డు పర్యటనలు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్రధాన జంక్షన్‌లను అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోనే తొలిసారిగా మహిళల కోసం ప్రత్యేక పార్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నగరంలో నాలుగు ఫుడ్ బ్యాంక్‌లు ఏర్పాటు చేసి తద్వారా అన్నార్తులకు ఆకలి బాధను తీరుస్తున్నామన్నారు. రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారునాయుడు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమమే అజెండాగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రజా పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. నిరంతరం సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ నగరాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ముద్దాడ మధు, ఇసరపు రామకృష్ణ, చందక శ్రీనివాస్, కుమ్మరగంటి శ్రీనివాసరావు, కాళ్ల సూరిబాబు, ముద్దాడ ఆదినారాయణ, గుండ వీరభద్రయ్య, నామాల సర్వేశ్వరరావు, కోరాడ తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకూ అంబులెన్స్ సేవలు



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్యసేవ అంబులెన్స్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పశువులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. డెంకాడ, భోగాపురం మండలాల పరిధిలో సేవలు అందించే డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను డెంకాడ మండలం మోపాడలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కదలలేని, అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పశువులకు అంబులెన్స్ ద్వారా వైద్య సేవలు అందిస్తారన్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిన పశువులను అంబులెన్స్‌లో ఆస్పత్రులకు తరలిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, పశు వైద్య శాఖ ఉప సంచాలకుడు ఎ.రామచంద్రరరావు, సహాయ సంచాలకులు ఉమాశంకర్ మహాపాత్రో, జి.చక్రవర్తి, డెంకాడ, భోగాపురం మండలాలకు చెందిన పశువైద్యులు, సచివాయల పశుసంవర్ధకశాఖ సహాయకులు పాల్గొన్నారు.

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ వంశీ, తదితరులు

విజయనగరం: ప్రతి విద్యార్థీ దేశంకోసం ప్రాణాలర్పించిన మహనీయుల అడుగుజాడల్లో నడవాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ వంశీ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ, అనేక మంది మహనీయుల బలిదానం వల్ల మన భారతదేశానికి స్వతంత్రం వచ్చిందన్నారు. ప్రతి వ్యక్తీ అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని నింపుకోవాలని సూచించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దేశంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఉందని.. విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంతో పాటు విద్యార్థుల్లో జాతీయభావాన్ని పెంపొందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా భౌతిక్ ప్రముఖ తిరుపతిరావు, ఏబీవీపీ జిల్లా ప్రముఖ్ బోండా కాశీ, త్రినాథ్, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

కనులపండువగా సీతారాముల కల్యాణం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకుడు శ్రీహర్ష ఆధ్వర్యంలో సీతారాములకు స్నపనం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా కల్యాణం జరిపారు. ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని ఆరో డివిజన్ పరిధి జమ్ములోని పైడితల్లి అమ్మవారి జంక్షన్ నుంచి శనివారం సాయంత్రం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజారంజక సంక్షేమ పాలన పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. అందుకే గడప గడపకు.. కార్యక్రమాలకు విశేష స్పందన వస్తోందని చెప్పారు. కులం, మతం, వర్గం, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డివిజన్ కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాకర్షక పాలన సాగుతోందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల స్వయంగా ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని చెప్పారు. పర్యటనలో డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, ఏఎంసీ చైర్మన్ నడిపేన శోభారాణి, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొద్దాన అప్పారావు, జోనల్ ఇన్‌చార్జ్ బోడసింగి ఈశ్వరరావు, పార్టీ నాయకులు ఆల్తి శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు పాదిలాపు చిన్నికృష్ణ, ఆల్తి చిట్టిబాబు, నేతల సన్యాసిరావు, బార్నాల శ్రీనివాసరావు, రెడ్డి రామారావు, బూర జగ్గారావు, కోట్ల జగ్గునాయుడు, కోట్ల మల్లికార్జునరావు, నగర పాలక సహాయ కమిషనర్ ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది, ఆయా విభాగాల అధికారులు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.